ప్రజాశక్తి

శుక్రవారం 23 డిసెంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి





కార్మిక వర్గాన్ని కదిలించేలా పోరాటాలు

- స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం
- కనీస వేతనం కోసం పోరుబాట
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపు
- ఘనంగా సంఘం విశాఖ జిల్లా 12వ మహాసభ ప్రారంభం



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కార్మికుడంటేనే మన వాడు. పని చేసే చోట.. నివాస ప్రాంతాల్లో కార్మికులను గుర్తించి యూనియన్‌లోకి తేవాలి. పోరాటాల దిశగా సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక శక్తిని సమీకరించాలి' - అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగ రావు ఉద్ఘాటించారు. గురువారం ఉదయం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె)లో సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభలు ఉత్తేజపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వివిధ రంగాలకు చెందిన 360 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు ప్రారంభోపన్యాసం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏళ్ల కాలంలో కార్మికవర్గం ఎన్నడూ లేని సమస్యలను నేడు ఎదుర్కొంటోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తాము కార్పొరేట్లకు అనుకూలమని కార్మికవర్గానికి సవాలు విసురుతున్నాయని అన్నారు. దీన్ని ఎదుర్కొనడానికి యావత్ కార్మికవర్గాన్ని సమాయత్తం చేసే కృషిలో సిఐటియు తొలి నుంచీ అగ్ర భాగానే ఉందని వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం తక్షణ కర్తవ్యంగా సిఐటియు భావిస్తోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ కోసం, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



చేతులెత్తి తీర్మానాన్ని ఆమోదిస్తున్న ప్రతినిధులు

స్వాతంత్ర్య కాలంలోనే హక్కుల సాధన

రష్యాలో స్వాతంత్ర్యం వచ్చాక మన దేశంలో స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైందని, అ ల్లూరి, భగత్‌సింగ్ వంటి యువ నాయకులు ఉద్యమానికి బాటలు వేశారని అన్నారు. 18 ఏళ్లకే పని హక్కు, 60 ఏళ్ల తర్వాత ఉద్యోగ విరమణ, ఇతర ఆర్థికపరమైన హక్కులను కార్మికవర్గం సాధించిందన్నారు. ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వి.వి.గిరి లాంటి పలువురు నాయకులు ట్రేడ్ యూనియన్లలో పనిచేసినవారేనని మిగతా 2లో..



పతాకావిష్కరణ చేస్తున్న పద్మనాభరాజు

ప్రభుత్వం రుషికొండ విధ్వంసం ఆపాలి

వార్త 2లో..

ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాటం

వార్త 6లో..

అరకొరగా ట్యాబ్‌లు

ఇవ్వాల్సినవి 16 వేలు, జిల్లాకు చేరినవి 4,320

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఎనిమిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా ప్రభుత్వమిస్తున్న బైజూస్ ట్యాబ్‌లు జిల్లాకు సరిపడా రాలేదు. వారం రోజుల పాటు ట్యాబ్‌ల పంపిణీకి ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుట్టింది. రోజుకు ఒక నియోజకవర్గంలోని ఒక మండలంలో ట్యాబ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించింది. జిల్లాలోని 355 ప్రభుత్వ పాఠశాలల్లో 16 వేల మందికిపైగా విద్యార్థులున్నారు. ఉపాధ్యాయులు 2,200 మంది వున్నారు. ఉపాధ్యాయులకు ఒక్క ట్యాబ్ కూడా రాలేదు. విద్యార్థులకు ఇవ్వాల్సిన 16 వేల ట్యాబ్‌లకుగానూ 4,320 జిల్లాకు చేరాయి. వచ్చిన ట్యాబ్‌లను సర్దుబాటు చేసి ఆయా పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో కొంతమందికి అందజేస్తున్నారు. మిగిలిన ట్యాబ్‌లు ఎప్పుడొస్తాయన్న సమాచారం కూడా లేకపోవడంతో ఉన్న ట్యాబ్‌లను ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం వారం రోజుల పాటు పంపిణీ చేసేందుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు మిగతా 2లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజని

బిఎఫ్ - 7పై భయాందోళన వద్దు

- జాగ్రత్తలు పాటించండి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒమిక్రాన్ బిఎఫ్-7పై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని అన్నారు. బిఎఫ్ - 7 వ్యాప్తి నేపథ్యంలో ఆమె గురువారం రాత్రి జివిఎంసి కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్‌పై అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో కొత్త వేరియంట్ వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబును ఆదేశించారు. కరోనా పరీక్షల సంఖ్య మరింత పెంచాలని, కరోనా కేసుల్లో జీనోమ్ సీక్వెన్సింగ్ (జన్యు క్రమాల విశ్లేషణ) చేయించాలని, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



కోలాటంతో ఆకట్టుకున్న మహిళా కార్యకర్తలు



విరాళం అందజేస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

కార్మిక వర్గాన్ని కదిలించేలా పోరాటాలు

నర్సింగరావు గుర్తుచేశారు. బిజెపి దేశంలో అధికారంలోకి వచ్చాక ప్రజలను రెచ్చగొట్టి, కుల, మత పరంగా చీల్చడం ద్వారా ప్రజా, కార్మిక ఉద్యమాలను బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతోందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ కాలరాస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్రం నిర్ణయించిన క్షణం నుంచీ సిఐటియూ పోరాడుతూ.. ప్రైవేటీకరణను ఆపగలిగేలా కార్మికవర్గాన్ని సమీకరించగలుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సిఐటియు ఆ రకంగా ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని నేటికి 680 రోజులుగా నిర్వహించడం గొప్ప విషయమని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్రం రకరకాల కమిటీలు వేసినా కార్మికవర్గం ఐక్యంగా తిప్పికొడుతోందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని సిఐటియు డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఎన్నేళ్లు కార్మికుడు పనిచేసినా రూ.10 వేలు నుంచి రూ.15 వేలే అనే పద్ధతి పోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో ఉద్యోగ కల్పన చేస్తూ కార్మికవర్గాన్ని అణచి ఉంచుతున్నాయని, ఈ విధానాలపై పోరాటాలే సరైన మార్గమని, ఆ దిశగా మహాసభలో చర్చించాలని నర్సింగరావు ఆశించారు.



నివేదిక ప్రవేశపెడుతున్న కుమార్

తొలి రోజు తీర్మానాలివే..

మహాసభ తొలి రోజు మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. స్టీల్‌ప్లాంట్ రక్షణకు విశాల ఐక్య ఉద్యమం నిర్మిద్దాం. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకుందాం' అని విశాఖ ప్రజానీకానికి మహాసభ విజ్ఞప్తి చేసింది. ఈ తీర్మానాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరాం ప్రవేశపెట్టగా జిటిపి.ప్రకాష్ బలపర్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎస్‌పిసిఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సత్యనారాయణ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ బలపర్చారు. 'నివాస ప్రాంతాల్లో పనికి సిద్ధం అవ్వాలి' అనే తీర్మానాన్ని బి.జగన్ ప్రవేశపెట్టారు. ఆర్.లక్ష్మణమూర్తి బలపర్చారు.

అమరులకు ఘన నివాళి

మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు జెండావిష్కరణ చేశారు. ఇటీవల కాలంలో మరణించిన సంఘం నాయకులు ఎవి.రమణారావు, డి.అప్పలనాయుడు, ఎన్.రమణాచలం, ఆర్‌పి.రాజు, కె.సూర్యనారాయణ చిత్రపటాలకు రాష్ట్ర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగీతాలు ఆలపించారు.

అధ్యక్ష వర్గం

ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా పి.మణి, ఆర్.లక్ష్మణమూర్తి, వై.రాజు, పి.వెంకటరెడ్డి వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పరిశీలకులుగా పాల్గొన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఈ మూడేళ్ళ కాలంలో నిర్వహించిన పోరాటాలు, వాటి అనుభవాలను తెలియజేశారు. కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్టుకు విరాళాల వెల్లువ

సిఐటియు జిల్లా మహాసభలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె) ట్రస్టుకు విరాళాలను విరివిగా అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు రూ.3 లక్షల చెక్కును ఎవికె ట్రస్టు ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు, విఎస్.పద్మనాభరాజు, జె.అయోధ్యరామ్, జగ్గునాయుడు, కుమార్‌కు అందజేశారు. గతంలో ఈ యూనియన్ రూ.2 లక్షలను విరాళంగా ఇచ్చింది. మరో రూ.5 లక్షలను భవిష్యత్తులో ఇవ్వనున్నట్లు ఆ యూనియన్ వెల్లడించింది. స్టీల్‌ప్లాంట్ క్యాంటీన్ వర్కర్స్ రూ.లక్ష అందజేశారు. తోపుడుబండ్ల సంఘం కార్యదర్శి మూర్తి రూ.5 వేలు, ఎన్‌టిపిసి కార్మికులు రూ.5 వేలు అందజేశారు.

అరకొరగా ట్యాబ్‌లు

చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో ట్యాబ్‌లు అందజేసిన తరువాత వాటి వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించనున్నారు. పంపిణీ చేస్తున్న ట్యాబ్‌ల వినియోగంపై ఒక స్పష్టత ఇవ్వకపోవడంతో కాస్త గందరగోళం కనిపిస్తోంది. ఇంటర్నెట్ ఉండాలా, లేదా ?, ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా ట్యాబ్‌ను పాఠ్యాంశాల వరకు ఉపయోగించుకొనే వీలుందా ? అనేది కూడా తెలియడంలేదు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో ట్యాబ్‌లు జిల్లాకు చేరిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

బిఎఫ్ - 7పై భయాందోళన వద్దు

కరోనా వ్యాక్సిన్ ప్రికాషన్ డోసులను ప్రోత్సహించాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించాలని, ఆసుపత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మరోసారి ఆక్సిజన్ ప్లాంట్ల పనితీరుపై సమీక్ష నిర్వహించాలని కోరారు. ఆసుపత్రుల్లో పడకలు, మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, అవసరమైన మందులు, ధరలపై పర్యవేక్షించాలని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త వేరియంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా జగనన్న ప్రభుత్వం ఎదుర్కొంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక కేసు కూడా నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అప్రమత్తతపై సమీక్ష నిర్వహించామన్నారు.

ప్రభుత్వం రుషికొండ విధ్వంసం ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతిపక్షాల, ప్రజా సంఘాల, సిఆర్‌జెడ్ నిబంధనలు, ప్రజాభీష్టాన్ని తుంగలో తొక్కి రుషికొండను ధ్వంసం చేసి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతోందని, తక్షణం రుషికొండ విధ్వంసం ఆపాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రుషికొండ విధ్వంసంతో పర్యావరణానికి ప్రమాదమన్న నిపుణుల సూచనలను ప్రభుత్వం బేఖాతరు చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఒక వైపు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామంటూ మరోవైపు అందాలకు నిలయమైన విశాఖను, ప్రకృతి సంపదైన రుషికొండను ధ్వంసం చేస్తోదని అన్నారు. విశాఖ సముద్ర తీరప్రాంతమని, పెను తుపాన్లు నుంచి విశాఖ ప్రజలను కాపాడటంలో కొండలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. ఇక్కడ సుమారు 10 ఎకరాలలో మాత్రమే ప్రాజెక్టు అభివృద్ధికి సిఆర్‌జెడ్ క్లియరెన్స్ ఇచ్చిందని, మిగతా ప్రాంతానికి పర్యావరణ అనుమతులు లేవని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లడం దుర్మార్గమని జగ్గునాయుడు అన్నారు. ఇది ఒక రహస్య ప్రాజెక్టుగా దీని పరిశీలనకు కూడా రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను అనుమతించడం లేదని తెలిపారు. పోలీసులనుపయోగించి అక్రమ అరెస్టులు చేయించి నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. ప్రజల ప్రజాతంత్ర హక్కులను కాలరాయడం శోచనీయమన్నారు. రుషికొండ విధ్వంసంలో కొందరు అధికారపార్టీ పెద్దల ప్రయోజనాలు దాగున్నాయన్న సందేహం ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కోస్టల్ రీజియన్ జోన్ నిబంధనలు పాటించాలని, రుషికొండ ధ్వంసాన్ని ఆపి, పర్యావరణాన్ని, విశాఖ ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

వివాదాస్పద 3600 గజాలకూ కంచె

- డిజిపిఎస్ ఎక్విప్‌మెంట్‌తో సర్వే చేపట్టిన సాంఘిక సంక్షేమ శాఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

లొకేషన్ కచ్చితంగా వెల్లడికావడం కోసం జరిగే డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డిజిపిఎస్) సర్వేకు విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సిరిపురం జంక్షన్ వద్దగల వివాదాస్పద సిబిసిఎన్‌సి స్థలంలో గురువారం పరిశీలన జరిపారు. ఈ మేరకు ఆ శాఖకు రూ.12 లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరైంది. సిబిసిఎన్‌సి స్థలం 18300 గజాలు, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 3600 గజాలపైనా ఈ సర్వే చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. 3600 గజాల స్థలం పొజిషన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నందున చుట్టూ కంచె వేసే దిశగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ స్థలానికి అక్రమంగా టిడిఆర్‌ను మంజూరు చేశారన్న అంశంపై ఇటీవల ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ స్థలం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్‌కు గతంలో ఎలా దఖలు పడిందో సంబంధిత ఉన్నతాధికారి 'ప్రజాశక్తి'కి వెల్లడించారు.



పరిశీలన జరుపుతున్న ఎస్‌డబ్ల్యు జెడి రమణమూర్తి, తదితరులు

సిబిసిఎన్‌సి స్థలం ట్రస్టు పేర లేదు. అందులో 3600 గజాలు పొజిషన్ మాకుంది: ఎస్‌డబ్ల్యు జాయింట్ డైరెక్టర్ డివి.రమణమూర్తి

సిబిసిఎన్‌సి ట్రస్టు పేరు మీద లేదు. 18300 పైచిలుకు గజాలూ ఓ వ్యక్తి పేర ఉంది. ఇక్కడే మాకు కేటాయించిన 3600 గజాలూ ఉంది. దీని కాంపౌండ్ వాల్ కోసం రూ.90 లక్షలను మా ఇంజినీర్ ఇటీవల అంచనా వేశారు. ఈ నిధులు వస్తే కాంపౌండ్ వాల్‌ను 3600 గజాలకు నిర్మించాలని చూశాం. అయితే ఇటీవలే రూ.12 లక్షలు విడుదలైంది. డిజిపిఎస్ సర్వేకు ఎక్విప్‌మెంట్ కూడా వచ్చేసింది. త్వరలో ఫెన్సింగ్ వేస్తున్నాం.

దఖలు ఎలా పడింది ?

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) సర్వేలో మిగులు భూములు గతంలో తేలాయి. 2006లో అలా యుఎల్‌సి సర్వే చేయగా మిగులు భూమి 3600 గజాలను సిరిపురం వద్ద తేల్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం అధీనంలో తొలుత ఈ స్థలం ఉండేది. తర్వాత సాంఘిక సంక్షేమ శాఖకు దీన్ని కేటాయించారు. 2009లో జీవో కూడా వచ్చింది.

ఈ విషయం సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారుల నుంచి విశాఖ జిల్లా స్థాయి కార్యాలయం వరకూ సమాచారం తెలియదు. కేవలం అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) విభాగానికే సమాచారం పరిమితమైంది. సిబిసిఎన్‌సి స్థలం, తమ 3600 గజాలపైనా కొన్ని కేసులున్నా ఆధారాలు వారి వద్ద లేవు. దీంతో కోర్టు స్టేగానీ, ఇంజక్షన్ ఆర్డర్‌గానీ లేనందున, పొజిషన్ మాకే ఉండడం చేత మా స్థలాన్ని మేం స్వాధీన పరచుకుంటున్నాం. పలువురు తమదంటూ అర్థించినా.. ఎలాంటి ఆధారాలూ వారి వద్ద లేవని.. ఉంటే తేవాలని చెప్పాం.

శ్రీ కనకమహాలక్ష్మి ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కొత్తరోడ్డులోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో మహా అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

630వ రోజుకు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రయివేటీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారానికి 630వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు గోపాలపట్నం జోన్ కార్మికులు ఎస్.చిన్నారావు, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



అనంతవరం హైస్కూల్లో ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపిపి కె.రాంబాబు

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో గురువారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమునిపట్నం : స్థానిక పిఎస్ఎం జివిఎంసి ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న శ్రీ రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపకులు కె వీరవెంకట సత్యనారాయణ సోదరులు గణిత శాస్త్ర పరీక్షలకు సంబంధించిన నమూనా ప్రశ్న పత్రాలను పాఠశాలకు అందజేశారు. పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన పలు గణిత నమూనాలతో కూడిన ఎగ్జిబిషన్ ఎంతగానో ఆలోచింప జేసింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తిరుమల శ్రీదేవి, గణితం, సైన్స్ ఉపాధ్యాయులు మహాలక్ష్మి, కుమారి, నాగ భూషణం, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణా రావు పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార : బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యాన అక్కయ్యపాలెంలోని వాగ్దేవి స్కూల్లో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పారిశ్రామిక వేత్త భరణికాన రామారావు హాజరై శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎగ్జిబిషన్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎంవివి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ శైలజ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం గణిత శాస్త్ర దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఎంపిపి కె.రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు 30 రకాల గణిత ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్, సర్పంచ్ జి.లక్ష్మి, గణితం ఉపాధ్యాయులు రామకృష్ణ, దీనలత పాల్గొన్నారు.



భీమిలిలోని పిఎస్ఎం ఉన్నత పాఠశాలలో గణిత నమూనాల ప్రదర్శన

నేరాలు ఘోరాలు

తాపీ మేస్త్రి ఆత్మహత్య

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన శీర నరసయ్య (30) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పద్మనాభం ఎస్ఐ నక్కా శ్రీనివాసరావు కథనం ప్రకారం... మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన శీర నరసయ్య (30) 12 సంవత్సరాల క్రితం జీవనోపాధి నిమిత్తం విశాఖ నగరానికి వెళ్లాడు. అక్కడ తాపీ పనిచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బుధవారం రాత్రి స్వగ్రామానికి వచ్చి తన ఇంట్లో దూలానికి తాడు కట్టి ఉరి వేసుకున్నాడు. అతని భార్య పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం తాటితూరు పంచాయతీ చిల్లవానిచెరువు వద్ద గ్రామీణ నీటి సరఫరా విభాగానికి చెందిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లో ఉన్న సామగ్రి చోరీకి గురైంది. మండలంలోని మజ్జివలస, సింగనబంద, లక్ష్మీపురం గ్రామాలకు తాగునీటి సరఫరా నిమిత్తం ఈ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుచేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ జె.రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తుక్కు దుకాణం వద్ద పేలుడు : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పెద్ద బజారు, పిండి మిల్లు సమీపంలో ఉన్న ఓ ఇనుప తుక్కు దుకాణం వద్ద గురువారం సాయంత్రం పేలుడు సంభవించింది. ఎస్ఐ జి.హరీష్ కథనం ప్రకారం... స్థానిక ఎగువ పేటకు చెందిన ఉమ్మిడి రామస్వామి (55) రోడ్డు పక్కన, వీధుల్లో ఇనుప ముక్కలు, చిత్తు కాగితాలు, గాజు సీసాలు ఏరుకుంటూ జీవిస్తుంటాడు. స్థానిక బీచ్‌లో గాజు సీసాలు, ఇనుప గుల్లు లాంటి సామగ్రి సంచిలో ఏరుకుని, అమ్మేందుకు తుక్కు దుకాణం వద్దకు వచ్చి, వాటిని కింద వేస్తున్న క్రమంలో పెద్ద పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే కెజిహెచ్‌కు తరలించారు. ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపట్నం : విశాఖ తెలుగు సినిమా కళాకారుల ఆధ్వర్యాన పేద కళాకారులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ పి.ఆదినారాయణ మాట్లాడుతూ, క్రిస్మస్ సందర్భంగా ఏటా పేద కళాకారులకు, వృద్ధులకు తమ వంతు సహాయంగా వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా పేద కళాకారులకు రు.5000 ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంగమ్మ, లక్ష్మీరాజ్యం, నాగలక్ష్మి, నర్సింగరావు ప్రసాద్ పాల్గొన్నారు

'ఐ లవ్ మై స్కూల్'

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యాన అక్కయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం 'ఐలవ్ మై స్కూల్' కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షంసుద్దీన్ ఆధ్వర్యాన 45 మంది వాలంటీర్లు పాఠశాల విద్యార్థులకు క్రాఫ్ట్ మేకింగ్, గణితంలో మెలకువలు, సత్ప్రవర్తన, కెరీర్ గైడెన్స్‌తో పాటు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులను డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర అభినందించారు.

ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు : ఇఒ

ప్రజాశక్తి-సింహాచలం: ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఇఒ వి.త్రినాథరావు తెలిపారు. ముక్కోటి, వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ట్రస్టు బోర్డు సభ్యులతో ఇఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని సుప్రభాత సేవతో మేలుకొల్పిన అనంతరం ఉదయం 4:30 నుంచి 10 గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి రోజున సుమారు 70 వేల మంది భక్తులకు సరిపడా అధికారులు ఏర్పాట్లుచేపట్టారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ముచ్చర్లలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ కొరాడ శైలజ

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామంలో పిహెచ్‌సి వైద్యాధికారి కొరాడ శైలజ ఆధ్వర్యాన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శినగం ఎర్రయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య అధికారి డాక్టర్ కొరాడ శైలజ సుమారు 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలింతలు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారికి పరీక్షలు జరిపారు. గర్భిణులకు ఈసీజీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్లకు వెళ్లి వారు తీసుకుంటున్న చికిత్స, వాడుతున్న మందులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ, పాఠశాలల్లో పిల్లల ఆరోగ్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రయ్య మాట్లాడుతూ, ప్రజలకు వైద్యం మరింత చేరువచేయాలనే తలంపుతో జగన్మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రవేశపెట్టారని తెలిపారు. 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి డాక్టర్ జి.ఆదిత్య, ఎంపిటిసి గుసిడి ముత్యాలు, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ప్రసాదరావు, ఆరోగ్య పర్యవేక్షకులు టి.కల్యాణమ్మ, శ్యామ్, దేవి, ఆరోగ్య కార్యకర్తలు ఎస్.రాములమ్మ, సియాద్రి నరసింహమూర్తి, జ్ఞానేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై గీతం పరిశోధనలు అత్యుత్తమం

అమెరికన్ వైద్య నిపుణుల ప్రశంసలు



గీతంలో అమెరికా వైద్య నిపుణులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కేన్సర్‌పై జరుగుతున్న పరిశోధనలు అత్యుత్తమంగా ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ హెల్త్ సైన్స్ సెంటర్ నిపుణులు ప్రొఫెసర్ జెకె.విశ్వనాథ్, ప్రొఫెసర్ లావణ్య ప్రశంసించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించి గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, జిమ సర్ ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నార్త్ టెక్సాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.విశ్వనాథ మాట్లాడుతూ అమెరికాలోని వైద్య సమాచార నిర్వహణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ కన్సార్టియం (ఎయిమ్) తరుపున ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు డేటా సమీకరణ, పరిశోధనల వివరాలను తెలియజేశారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవటం మాట్లాడుతూ, గీతంలో 1500 మంది పరిశోధక విద్యార్థులు వివిధ అంశాలపై అధ్యయనాలు చేస్తున్నారని, 122 పేటెంట్లకు గీతం పరిశోధకులు దరఖాస్తు చేశారని, 22 పరిశోధనా కేంద్రాలు, 271 పరిశోధన ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని తెలిపారు. గీతంలో కొత్తగా బయోనెస్ట్ పరిశోధన కేంద్రం, అటల్ ఇన్నోవేషన్ సెంటర్, డిఎస్‌టి-సతి కేంద్రం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. బోధనతో పాటు పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎమ్.బాలకుమార్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ రామారావు, కేన్సర్‌పై పరిశోధనలు జరుపుతున్న ప్రొఫెసర్ మళ్ల రామారావు, డాక్టర్ జివి.శిరీష, డాక్టర్ పి.శాంతిలత, డాక్టర్ ఎ.కృష్ణచైతన్య, డాక్టర్ గ్రీష్మ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనికేన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.గణపతి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార: నగరానికి చెందిన సెయింట్ పాల్స్ థియోలాజికల్ కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎన్.పాల్ అధ్యక్షతన గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా రెండు వందలమంది పేదలకు దుప్పట్లు, దుస్తులు అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మ దినోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర, ఎయు బిఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ప్రొఫెసర్ టి.శోభాశ్రీ, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ, పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా అడుగులు వేయాలన్నారు. డాక్టర్ కెవిఎన్.పాల్ మాట్లాడుతూ, నిరుపేదల మోములో చిరునవ్వులు చిందించేందుకు ఏటా క్రిస్మస్ ముందు వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రిష్టియన్ ఇంపాక్ట్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ స్టీవెన్, కళాశాల బోర్డు మెంబర్ డాక్టర్ దేవ ప్రసాద్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నగర కన్వీనర్ కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నా అప్పలరాజుకు సన్మానం

ప్రజాశక్తి-సిరిపురం : పన్నెండు గంటల పాటు తబలా వాయిద్యంతో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అరుదైన స్థానం పొందిన చెన్నా అప్పలరాజును గురువారం ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన చాంబర్లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తబలిస్టుగా, బాక్సింగ్ కోచ్‌గా, విశ్వ విద్యాలయ ఉత్తమ ఉద్యోగిగా అప్పలరాజు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆసక్తి గల కళాకారులు ఏయు సంగీత కళా విభాగంలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయు ప్రధాన భద్రతాధికారి మహ్మద్ ఖాన్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధినేత సిహెచ్‌వి.సత్యనారాయణ, కళాకారుడు ఇనుకపల్లి అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి-గాజువాక: గాజువాక బీసీ రోడ్డు రాజీవ్ మార్గ్, సంజీవగిరికాలనీలో ఇటీవల మృతిచెందిన తాడి ధనలక్ష్మి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలను 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోయిన వారికి ఈ బీమా ఆర్థిక భరోసానిస్తుందన్నారు. ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా రూ.లక్ష మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మృతురాలి తండ్రి అప్పలనాయుడు, నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్, ఇరోతి గణేష్, సచివాలయ సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కెకె.రాజు

బిఎస్ లే-అవుట్‌లో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి బిఎస్ లే-అవుట్ -2లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అనీల్‌కుమార్ రాజుతో కలిసి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గురువారం ఉదయం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం కెకె.రాజు మాట్లాడుతూ, గడపగడపకు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలపై నిర్లక్ష్యం వద్దని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, కిరణ్ రాజు, రాయుడు శ్రీను, దిడ్డి రమేష్, ప్రవీణ్, కె.సుశీల, లంక భాస్కర్, బల్ల శ్రీను, సమ్మెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

26వ వార్డులో...

జివిఎంసి 26వ వార్డు పరిధి సాయిబాబా గుడి సమీపంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కెకె.రాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులెవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు పిలవ వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు కిరణ్‌కుమార్, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

బిజెపిని గద్దె దించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : నిరుద్యోగం, ధరలను పెంచుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిపిఐ నాయకులు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. సిపిఐ 98వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో శ్రీనివాస్‌నగర్ ఆర్చ్ వద్ద సిపిఐ జెండాను రావి కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభనుద్దేశించి వామనుమూర్తి మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదం, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, దున్నేవాడికే భూమిపై హక్కు కల్పించాలని, రాజభరణాలు రద్దు, జాతీయ బ్యాంకులు, పరిశ్రమలు కావాలని దేశ వ్యాప్తంగా పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అన్నింటి ధరలు పెంచుతున్నాయన్నారు. దేశానికి వెన్నెముక అయిన కార్మిక వర్గం, రైతాంగం హక్కులను హరిస్తూ దేశంలో బడా కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు రాయితీలు కల్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని 2024 ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంద్రేకుల రాము, కోటి, ఎస్ రాము, అప్పారావు, ఎస్.నీలకంఠం, జి.గోవిందు, శ్రీను, ఎస్.అఖిల్, జి.రవి, జై.గణేష్‌కుమార్, వై.వెంకట్, మైలపల్లి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైతు బజారులో డిసిఎంఎస్ దుకాణం

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతుబజార్‌లో డిసిఎంఎస్ దుకాణాన్ని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ పి.చినతల్లి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ వినియోగదారులకు మంచి నాణ్యత ప్రమాణాలతో కూడిన సరుకులను సరసమైన ధరలకే అందించాలని డిసిఎంఎస్ అధికారులకు సూచించారు. డిసిఎంఎస్ చైరపర్సన్ పి.చినతల్లి మాట్లాడుతూ, నాణ్యత కలిగిన సరుకులు వియోగదారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ బ్రాంచ్ మేనేజర్ చంద్రకుమార్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకుడు కె.ప్రతాప్, రైతుబజార్ వినియోగదారుల కమిటీ సభ్యులు, డిసిఎంఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రైతు బజార్‌లో ప్రారంభమైన డిసిఎంఎస్ దుకాణం

ప్రగతి పథంలో భూమాత

◆ సామాన్యుల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్న సంస్థగా గుర్తింపు ◆ ఆంధ్ర, తెలంగాణల్లో సేవలు
◆ ప్రజల విశ్వాసం, అభిమానం చూరగొన్నాం ◆ 'ప్రజాశక్తి'తో సంస్థ చైర్మన్ తాళ్లూరి పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : **రెండు దశాబ్దాలుగా అన్ని తరగతుల ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తూ ప్రగతి పథంలో పయనిస్తున్నామని భూమాత గ్రూపు చైర్మన్ తాళ్లూరి పూర్ణచంద్రరావు అన్నారు. ఉత్తరాంధ్రలో సేవలను ప్రారంభించిన తాము నేడు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నామని తెలిపారు. సంస్థ ప్రగతిపై ఆయన 'ప్రజాశక్తి'కి పలు వివరాలు వెల్లడించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..**

భూమాత గ్రూపు అత్యంత విశ్వాసం, నమ్మకంతో ముందుకు సాగుతోంది. ప్రజల ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా నడుచుకుంటోంది. సాధారణ, మధ్య తరగతి ప్రజలు, సీనియర్ సిటిజన్ల అభిరుచికి అనుకూలంగా పని చేస్తోంది. ఆంధ్రాలోని ఉత్తర కోస్తా జిల్లాల్లో కేంద్రీకృతమై సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనశైలిని అప్‌గ్రేడ్ చేసే ప్రాజెక్టుల నిర్మాణాలు చేస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. అందుబాటు ధరలలో అన్ని రకాల సదుపాయాలతో, అన్ని ప్రయోజనాలు చేకూర్చేలా రియల్ ఎస్టేట్ సేవలను అందించడంలో ఈ సంస్థ పూర్తి స్థాయిలో విజయవంతమైంది. గడిచిన 20 ఏళ్లుగా ప్రజలకు అతి చేరువైన సంస్థ భూమాత గ్రూపు. ఈ సంస్థ రెండు దశాబ్దాల క్రితం ఒక చిన్న ఆఫీసులో అతి తక్కువ మంది ఉద్యోగులతో ప్రారంభమైంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ సిబ్బందికి, అడ్మిన్ స్టాఫ్‌తో పాటు లే అవుట్లలో ఇంకొంతమందికి ఉద్యోగాలు కల్పించింది. నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి వేల మంది ప్రజలకు వారి చిరకాల కోరిక అయిన సొంత ఇంటి కలను నిజం చేస్తూ వస్తోంది. సంస్థ ఇప్పటి వరకూ 30 వెంచర్లు, అపార్టుమెంట్ సదుపాయాలూ పూర్తి చేసి మరొక 20 వెంచర్లు నిర్మిస్తూ ప్రగతి పథంలో పయనిస్తోంది. మన రాష్ట్రంలో విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా పనిచేస్తూ విజయవాడ, శ్రీకాకుళం, బొబ్బిలి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి ప్రాంతాల్లోనూ, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, ఖమ్మం సహా మరికొన్ని చోట్ల అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు, ప్రమాణాలతో ముందుకు సాగుతోంది. ఉత్తరాంధ్రలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన సంస్థగా భూమాత గ్రూపు నిలుస్తోంది.

bhoomatha ® భూమాత గ్రూప్ group
PIONEERS IN REAL ESTATE & CONSTRUCTIONS

వెంచర్లు, ప్రాజెక్టులు

ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విశాఖపట్నం పరిసర ప్రాంతాలలో రాజుల తాళ్లవలస, జొన్నాడ, దాకమర్రి, సొంత్యాం, తగరపువలస, సంగివలస, మధురవాడ, సీతంపేట, కొమ్మాది, గాజువాక, మద్దిలపాలెం, సీతమ్మధార, రామాటాకీస్, హెచ్‌బి.కాలనీ ప్రాంతాల్లో పలు ప్రాజెక్టులు పూర్తి చేసి వందల సంఖ్యలో తమ ఖాతాదారులకు అందించింది. విఎంఆర్‌డిఎ నిబంధనలకు లోబడి ప్రభుత్వ నియమాలు పాటిస్తూ, లే అవుట్లు వేస్తూ నాణ్యతతో కూడిన అపార్టుమెంట్లు నిర్మిస్తూ ఖాతాదారులకు భవిష్యత్తులో కుడా ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఒక స్థిరమైన నమ్మకం, భరోసా కల్పిస్తూ భూమాత గ్రూపు ముందుకెళ్తోంది. పస్తుతం పద్మనాభం మండలంలోని రేవిడి, భోగాపురం, కాపులుప్పాడ, పోలిపల్లి, మోపాడ, ప్రాంతాల్లో నూతన వెంచర్లు, అపార్టుమెంట్లు, విల్లాలు నిర్మిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తోంది. విశాఖపట్నం ప్రాంతంలోనే కాకుండా విజయనగరం జిల్లాలో పెడతాడివాడ, విజయవాడలో కంకిపాడు, కానూరు ప్రాంతాల్లో పలు అపార్టుమెంట్లను నిర్మించి వినియోగదారులకు అందించింది. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం, బొబ్బిలిలో రంగంపేట ప్రాంతాల్లో విస్తరించి వెంచర్లు, అపార్టుమెంట్లు నిర్మిస్తోంది. ముఖ్యంగా ప్రశాంత్ విహార, బృందావనం, శ్రీ చక్ర గ్రీన్ వ్యాలీ, ఎన్‌ఆర్‌ఐ రాయల్, తాళ్లూరి టౌన్ షిప్ - 1, అమరావతి గ్రీన్ సిటీ ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయి ప్రజల్లో ఎంతో పేరుగాంచాయి. అంతేకాకుండా ప్రస్తుతం తాళ్లూరి టౌన్ షిప్ - 2, భూమి శ్రీ టౌన్ షిప్, రేవిడి వద్ద సాయి పద్మనాభ ఎస్టేట్స్ వెంచర్లకు ఎల్‌పి నెంబర్లు పొందింది. వీటిలో ముఖ్యంగా ప్రశాంత్ విహార ప్రాజెక్టులో గతంలో గజం మూడు వేల రూపాయలకు అమ్మగా ఇప్పుడు దాని విలువ సుమారుగా 20 వేలకు పైగా ఉంది. వీటితో పాటు సిఎంఆర్ గ్రూప్ భాగస్వామ్యంతో కాపులుప్పాడ, భోగాపురం దగ్గర రావాడ ప్రాంతాల్లో ప్రాజెక్టు నిర్మితమవుతోంది.



తాళ్లూరి పూర్ణచంద్రరావు

సౌకర్యాలు, ప్రత్యేకతలు

భూమాత గ్రూపు ఖాతాదారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో లగ్జరీ, రిచ్ క్లాస్ భవనాలను అందిస్తూ వస్తోంది. విశాలమైన రోడ్లు, క్లబ్ హౌస్‌లు ఉన్నాయి. ప్రపంచ స్థాయి నాణ్యతను పాటిస్తూ జాతీయ రహదారులకు అతి చేరువలో అత్యాధునిక వసతి, ఇతర సౌకర్యాలతో ప్రజలను ఆకర్షిస్తున్నాం. యోగా, ధ్యానం, వినోద కార్యకలాపాలు, వ్యవసాయం, 24 గంటలూ డాక్టర్, అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచుతోంది. తమ లేఅవుట్ల నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అపోలో, పినాకిల్ మొదలైన ప్రసిద్ధ ఆసుపత్రులతో టై అప్ చేసుకున్నందున ఆరోగ్య నిపుణులచే రెగ్యులర్ చెకప్‌ల ద్వారా ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. పచ్చదనం, రోడ్లు, సెక్యూరిటీ, పిల్లలకు ప్లే గ్రౌండ్లు, పార్కులతోపాటు క్లబ్ హౌస్, జిమ్, స్విమింగ్ పూల్, సోలార్ వీధి దీపాలు, ఇండిపెండెంట్ కాటేజీలు వంటి సౌకర్యాలతో ప్రాజెక్టులు ఉన్నాయి. ఎన్‌ఆర్‌ఐ సేవలు భూమాత గ్రూపు ప్రత్యేకం. విదేశాల్లో నివసించే భారతీయులు భారతదేశంలో ఆస్తిని కొనుగోలు చేసేందుకు భూమాత గ్రూపు తోడ్పడుతోంది. చాలా సులభంగా స్థిరాస్తులను కొనుగోలు చేసేందుకు పలు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తోంది. అన్ని తరగతుల వారి అభిమానంతో మేం ముందుకు వెళ్తున్నాం. నాణ్యమైన ప్లాట్‌ల కోసం అన్వేసించేవారు ఠక్కున భూమాత గ్రూపును సంప్రదిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించే సంస్థగా ప్రజల మదిలో నిలవడం ఆనందాన్నిస్తోంది.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి తపన

మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిత్యం తపన పడుతుంటారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని అన్నారు. ఆరిలోవ తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విడదల రజని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, డిఇఒ ఎల్.చంద్రకళ మాట్లాడుతూ, ఈ ట్యాబ్‌లను సద్వినియోగంచేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పాల్‌కిరణ్, కార్పొరేటర్లు కోరుకొండ స్వాతిదాస్, అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, ఎడ్యుకేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు జగ్గుపిల్ల అప్పలరాజు, కెల్ల సత్యనారాయణ, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, మాజీ మార్కెటింగ్ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున తదితరులు

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : 25వ వార్డు పరిధి మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులకు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు 97 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, చదుకోవాలని తపన పడే ప్రతి విద్యార్థికీ ఉన్నత విద్య వరకు ప్రభుత్వమే చేయుతనిచ్చేలా ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారన్నారు. కులమతాలకు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో ఉన్న ప్రజలందరి అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దేముడుబాబు, బోగవల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, సమ్మెట్ల వెంకటేష్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధిపై కేంద్రమంత్రికి వినతి



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా సబ్బవరం జంక్షన్ నుంచి నర్సీపట్నం మీదుగా తుని వరకు గల జాతీయ రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా మార్పు చేయాలని కోరుతూ గురువారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి సత్యవతి కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. నూతన జిల్లాలుగా ఏర్పడిన నేపథ్యంలో పెరుగుతున్న ట్రాఫిక్ దష్ట్యా ప్రమాదాలను అరికట్టేందుకు నాలుగు రోడ్ల లైన్లుగా మార్చాలన్నారు. అనకాపల్లి నుంచి ఆనందపురం జాతీయ రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రోప్ స్కిప్పింగ్ విజేత తేజకు అభినందన



తేజను అభినందిస్తున్న సర్పంచ్ నూకరాజు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన మండలంలోని పాటిపల్లి ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి, వాడ్రాపల్లికి చెందిన గండిబోయిన తేజను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు గురువారం అభినందించారు. జిల్లా స్థాయి పోటీలో మంచి ప్రతిభను కనబరిచి ద్వితీయ బహుమతి సాధించడం, రాష్ట్రపోటీలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేసి, రాష్ట్ర పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరాలని ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి పురోభివృద్ధి చెందాలని, తద్వారా సొంతూరుకు, కన్నవారికి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎల్లపు గోవిందరాజు, హెచ్ఎం బర్రె రత్నరాజు, ఫిజికల్ డైరెక్టర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనమా..?

టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్



మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి : దివాలా తీసిన బైజూస్ సంస్థకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని, అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు మండిపడ్డారు. ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనం సరికాదన్నారు. గురువారం స్థానిక రింగ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బైజూస్ సంస్థ నాణ్యమైన విద్యను అందిస్తున్న దాఖలాలు ఎక్కడ లేవన్నారు. ఎటువంటి సాధికారత లేని బైజూస్ సంస్థకు వందల కోట్ల అమ్మ ఒడి నిధులను కట్టబెట్టడం సరికాదన్నారు. దీనిని తక్షణమే రద్దు చేసి, బైజూస్‌సంస్థ అవకతవకలపై సిబిఐ విచారణ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో రూ.221 కోట్లను కాజేసారని ఆరోపించారు. బైజూస్ సంస్థ వేధింపులపై బాలల హక్కుల పరిరక్షణ సంస్థకు ఫిర్యాదు చేసిన సంగతి ముఖ్యమంత్రిగా తెలియదా అని ప్రశ్నించారు. ఈసమావేశంలో పార్టీ నాయకులు మల్ల గణేష్, కొట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

పెట్రో వర్సిటీ పనులకు సహకరించాలి

నిర్వాసిత రైతులకు అన్నివిధాలా న్యాయం : ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వంగలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- సబ్బవరం : పెట్రోలియం యూనివర్సిటీ పనులు సజావుగా కొనసాగించడానికి రైతులు సహకరించాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. గురువారం మండలంలోని వంగలిలో పెట్రో వర్సిటీ నిర్మాణ పనులను పున్ణప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్రోలియం యూనివర్సిటీ పనులకు కోర్టు అడ్డంకులు తొలగాయన్నారు. వర్సిటీ కోసం భూములను త్యాగం చేసిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో రైతులను భాగస్వామ్యం చేయాలని అధికారులను ఆదేశించారు నిర్వాసిత రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో గ్రామంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మూడున్నరేళ్లలో రైతులను పలుమార్లు జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లి చర్చలు జరిపినట్లు గుర్తు చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు వర్సిటీ పనులు పున్ణప్రారంభమే సమాధానమన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలో హైస్కూల్, కళ్యాణమండపం నిర్మాణాలకు 20ఎకరాలను భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు స్థానిక సర్పంచ్ ఆకుల శ్రీహేమ వినతిపత్రాన్ని అందించారు. ఆర్‌డిఒ చిన్నికృష్ణ మాట్లాడుతూ, పెట్రో వర్సిటీ ఏర్పాటుతో వంగలికి ప్రపంచస్థాయి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఐపిఇ ప్రతినిధి విజయ్‌కుమార్, ఎపిఐఐసి జోనల్‌మేనేజర్ త్రినాథరావు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, జడ్‌పి వైస్‌ఛైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, వైస్ ఎంపిపిలు చొక్కాకుల గోవింద, శరగడం ఝాన్సీ లక్ష్మీ రాము, వైసిపి నేతలు కోటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, సబ్బవరపు ముత్యాల నాయుడు, ఎంపిటిసి గవర తులసి రాజు, కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 24న జరగనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం 9వ తరగతి తెలుగు ,ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు జిల్లాస్థాయిలో వినియోగదారుల కమిషన్లలో కేసులను సమర్ధవంతంగా పరిష్కరించడం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియం వ్యాసరచనలో సబ్బవరం మండలం రావులమ్మపాలెం జడ్పీహెచ్ స్కూలు విద్యార్థిని జి జాహ్నవి ప్రథమ స్థానం, నక్కపల్లి మండలం జానకయ్య పేట జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థి డి హర్షవర్ధన్ ద్వితీయ స్థానం సాధించారు. తెలుగు మీడియంలో ఎలమంచిలి మండలం కొత్తపేట జడ్పీహెచ్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి డి మురళి శ్రీనివాస్ ప్రథమ స్థానం, సబ్బవరం మండలం రావులమ్మ పాలానికి చెందిన జి జాహ్నవి ద్వితీయ స్థానం సాధించారు. ఇంగ్లీష్ మీడియం వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సబ్బవరం మండలం రావులమ్మ పాలానికి చెందిన జి జాహ్నవి ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం ఎలమంచిలి మండలం కొత్తపేట జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థి టి రాహుల్ ప్రసాద్, తెలుగు మీడియం పోటీల్లో ప్రథమ స్థానం డి మురళి శ్రీనివాస్, ద్వితీయ స్థానం అనకాపల్లి మండలం సీతానగరం జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని ఆర్ జాహ్నవి సాధించారు. వీరు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా విద్యాశాఖ అధికారి బి లింగేశ్వర్ రెడ్డి తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 'అయ్యన్న' కాలేజీ విద్యార్థి ప్రతిభ



కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఖాసిం

ప్రజాశక్తి - కె.కోటపాడు : విశాఖపట్నం బుల్లయ్య కాలేజీలో నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ ఇంటర్ స్టేట్ కాలేజ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక అయ్యన్న డిగ్రీ కాలేజీ విద్యార్థి జి.కిరణ్‌కుమార్ రజత పతకాన్ని సాధించారు. 81 కిలోల పురుషుల వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానం దక్కించుని, వచ్చే ఫిబ్రవరిలో కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కిరణ్‌కుమార్‌ను అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసిం అభినందించారు. జూనియర్, డిగ్రీ కాలేజీ అధ్యాపకులు హర్షం వ్యక్తం వెలిబుచ్చారు.

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి -వడ్డాది : ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తామని జెడ్‌పిటిసి దొండా రాంబాబు అన్నారు. విజయరామరాజుపేట రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం దళారుల పాలుకాకుండా, మద్దతు ధరనిచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతుల ఖాతాల్లో 21రోజుల్లో నగదు జమ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి, పిఎసిఎస్ ప్రతినిధి దొండా సన్యాసిరావు, రైతు భరోసా సిబ్బంది ఆర్ భాగ్యలక్ష్మి, కె వరప్రసాద్, సాయి లక్ష్మి స్థానిక ఎంపిటిసిలు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని బోయపాడులో దండిసురవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు సందరాపు రమణబాబు ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కురచా జయమ్మ, తహసీల్దార్ బీవీ రాణి, మండల అగ్రికల్చర్ అధికారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రైవేటు వ్యాపారస్తులు, మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ధాన్యాన్ని అమ్మిన 21 రోజుల కాలంలో పేమెంట్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డేటా ఆపరేటర్ డి గోవిందు, విఏఏ సాయి తులసి పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'



దేవరాపల్లిలో టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - దేవరపల్లి : రాష్ట్రంలో వైసిపి దుర్మార్గపు పాలనను తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పివిజి కుమార్ అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నానాజీ అధ్యక్షతన మండలంలోని రైవాడ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, 'రచ్చబండ" కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పివిజి కుమార్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ఆరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్న క్యాంటీన్‌ను ఎత్తివేసి పేదలందరి కడుపు కొట్టిందన్నారు. వైసిపి పాలనలో ఎక్కడా అభివృద్ధి దాఖలాలు లేవని, ప్రజలంతా ఇదే ఖర్మ అంటూ ఆవేదన చెందుతున్నారన్నారు. నాగయ్యపేట గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ జెడ్‌పిటిసి పోతల పాత్రునాయుడు, దొగ్గ నాయుడు, బండారు రామారావు, కర్రి నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజుపాలెం పెదపూడి, పంగిడి గ్రామాల్లో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు గురువారం రాత్రి ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు ముచ్చకర్ల తాతీలు, సాయం శేషు, వియ్యపు అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ: 79వ వార్డు లంకెలపాలెం మరిడిమాంబ కాలనీలో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో నాయకులు హై స్కూల్ వైస్ చైర్మన్ కాటకోటి వసంత , ఎర్ర కోటేశ్వరరావు దాసరి రామారావు కర్రి జువ్వలు తురసాల శ్రీనివాసరావు దనకొండ చంద్రరావు, చిట్టి బోయిన అప్పారావు పివిఎన్ మూర్తి పాల్గొన్నారు.

గొలుగొండ : ముఖ్యమంత్రి జగన్ అరాచక పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం రాత్రి గొలుగొండ మండలం రావణాపల్లి, కొమిర గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసిపి చేస్తున్న ఆరాచకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, గడిచిన మూడున్నర కాలంలో వైసిపి ప్రభుత్వం ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్ట లేదన్నారు. మాట్లాడే నాయకులపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా నేను భయపడేది లేదని తెలిపారు. పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్‌లను తొలగించడం అన్యాయం మని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం ఒక్కటే ఇస్తున్నారని, పంచదారకు సబ్సిడీ కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, యూత్ అధ్యక్షులు కర్రి నాయుడు, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, కొల్లు సత్తిబాబు, కొత్త ఎల్లవరం సర్పంచ్ కొల్లు రాంబాబు, గెద్దం ఆనంద్ పాల్గొన్నారు



పరవాడలో ఇంటింటికి వెళ్లి వివరిస్తున్న టిడిపి నేతలు

కోటిని పరామర్శించిన జూపూడి



కోటిని పరామర్శిస్తున్న జూపూడి ప్రభాకర్

ప్రజాశక్తి -వడ్డాది : మాతృవియోగం పొందిన మాలమహానాడు యువజన అధ్యక్షులు బూసి కోటిని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయసలహాదారు జూపూడి ప్రభాకరరావు పరామర్శించారు. గురువారం వడ్డాదిలోని కోటి స్వగృహానికి వెళ్లి పరామర్శించి, సంతాపం తెలిపారు. బుధవారం గుండెనొప్పి రావడంతో కోటి తల్లిని చోడవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న జూపూడి ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చారు. కాగా కోటిని జెడ్‌పిటిసి దొండా రాంబాబు, టౌన్ వైసిపి నేత నారాయణ మూర్తి, ఉప సర్పంచ్ దాడి సూరిబాబు, బిజెపి నేత ఎస్.చిన వెంకయ్యదొర పరామర్శించారు.

వరి పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి -కశింకోట : మండల కేంద్రంలో వరి పంట దిగుబడుల అంచనాకు ఎఇ ఎం.స్వప్న ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మొల్లేటి శ్రీనివాసరావు రైతు పొలంలో ఐదు చదరపు మీటర్ల క్షేత్రంలో 11.280 కేజీల ధాన్యం దిగుబడి వచ్చిందని , తద్వారా ఎకరాకు 1827.36 కేజీల దిగుబడిగా అంచనా వేశారు. దీన్నిబట్టి ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్లేనన్నారు. కార్యక్రమంలో విఎఎ డి.రేవతి, బీమా ప్రతినిధి నూక అప్పారావు, ఎఇఒలు పి.

మాజీ సర్పంచ్ చంద్రరావు మృతి



చంద్రరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - యలమంచిలి : ఏకధాటిగా ఏడుసార్లు జంపపాలెం సర్పంచ్‌గా కొన సాగిన మాజీ సర్పంచ్ శిల పరశెట్టి చంద్రరావు వయో భారంతో గురువారం స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. యలమంచిలి మండలంలో రికార్డు స్థాయిలో 1970 నుండి 2001 వరకు ఏడు పర్యాయాలు జంపపాలెం సర్పంచ్ పదవి చేపట్టిన చంద్రరావు ప్రజల మనస్సు గెలిచిన నాయకుడిగా వెలుగొందారు. ఆయన లేని లోటు తీరనిదని జంపపాలెం పెద్దలు కొనియాడారు .చంద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన స్థానిక నాయకులు, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- బుచ్చెయ్యపేట : ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ అండ్ ఇంజినీరింగ్ (సిపెట్)లో మిషన్ ఆపరేటర్ ప్రాసెసింగ్, మిషన్ ఆపరేటింగ్ ఇంజక్షన్ మౌల్డింగ్‌లలో ఆరు నెలల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కెఎంఎం అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎలిశెట్టి ఈశ్వరరావు కోరారు. ఎంపికైన అభ్యర్థుల్లో స్త్రీ,పురుషులకు వేర్వేరుగా ఉచిత హాస్టల్ సదుపాయం ఉంటుందని, శిక్షణ కాలంలో రూ.మూడు వేలు స్టైఫండ్ ఇస్తారన్నారు. 18-30 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగులు అర్హులని, ఒబిసిలకు మూడేళ్ళు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9398050255 నెంబర్‌కు వాట్సాప్, లేదా నేరుగా కాల్‌చేసి సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ట్యాబులను ఈనెల 23న సీతయ్యపేట ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అందజేస్తారని ఇన్‌ఛార్జి ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో ట్యాబ్‌లకు అర్హులుగా 565మంది విద్యార్థులు న్నారన్నారు. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు.

ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాటం

ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) - 2020 పేరుతో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని, ప్రమాదకరమైన ఈ విధానాన్ని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. విద్య, ఉపాధి రంగాల సమస్యలపై పిడిఎస్ఒ ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల విలీనం లాంటి విద్యా సంస్కరణల పేరుతో విద్యను సామాన్యుల నుంచి దూరం చేస్తున్నారన్నారు. వీటికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాట దిశగా ముందుకు సాగాలన్నారు. సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త జహఆరా ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రస్తుత విద్య సృజనాత్మకంగా కాకుండా మూస పద్ధతిలో, మానవ యంత్రాలను తయారు చేసే విధంగా ఉందన్నారు. హిందుత్వ భావజాలంతో విద్యార్థుల మెదళ్లను నింపుతూ విద్యను కాషాయీకరిస్తున్నారని విమర్శించారు.

ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమగ్రమైన పాఠశాలలను, కళాశాలలను నిర్మించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు సరిపడా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేక, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మరోవైపు నిరుద్యోగంతో యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో యువతకు పోరాటమే ముందున్న పరిష్కారమన్నారు. పిడిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 30 వేల పోస్టులను, కేంద్రంలో ఉన్న 60 లక్షల పోస్టులను పాలకులు భర్తీ చేయట్లేదని తెలిపారు. పిడిఎస్ఒ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌతమి అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో నవ యువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.బాషా, పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ మాట్లాడారు. ఎల్.భాను, ఎస్.రుద్ర, కె.సోమేశ్, పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కశింకోటలో ట్యాబ్‌లు అందజేస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి -కశింకోట :కశింకోట బాలురు, బాలికల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత ట్యాబ్‌లను గురువారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ పార్టీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు. ఎంపిపి కలగా లక్ష్మి, మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి, ఎంఇఒ చిట్టిబాబు పాల్గొన్నారు

మునగపాక రూరల్: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనిప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ యు సుకుమార్‌వర్మ, జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చంనాయుడు, హెచ్‌ఎం కాండ్రేగుల సూర్యనారాయణ, ఆడారి సంతోష్‌కుమార్, ఎంపిటిసి సూరిశెట్టి రాము వైసిపి నాయకులు ఆడారి కాశిబాబు, భీమిశెట్టి ఉమా శంకర్, కాండ్రేగుల జగన్, బొద్దపు శ్రీరామమూర్తిపాల్గొన్నారు.

దేవరాపల్లి : పేద విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ విద్య విధానంలో పాఠ్యాంశాలు బోధించేందుకు వీలుగా ప్రభుత్వం ట్యాబ్‌లను అందిస్తోందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. దేవరాపల్లిలో నాలుగు పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కర్, జెడ్‌పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది మంచి విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎంపిపి గాడి కాసు, గాంధీ గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి -వడ్డాది : సమగ్ర భూసర్వేతో వివాదరహితంగా భూములపై హక్కులు పొందవచ్చని ఎల్‌బిపి అగ్రహారం సర్పంచ్ తమరాన శ్రీనివాసరావు అన్నారు. గురువారం గ్రామంలో సమగ్ర భూరీసర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాధారణంగా రైతుల భూములకు పూర్తి రికార్డులు ఉండవని, ఉన్నంతవరకు ఆన్‌లైన్‌లో లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి సమస్యలకు ఈ సర్వేతో చెక్ పడుతుందన్నారు. నెలరోజుల పాటు డ్రోన్ల సాయంతో ఆధునిక టెక్నాలజీతో సర్వే నిర్వహించి, రైతులకు భూహక్కు పాస్‌పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి జగ్గారావు, రైతు సంఘం అధ్యక్షులు తమరాన వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు సాయం రమేష్, యనమల వాసు, మాజీ సర్పంచ్ శిరిగిరిశెట్టి నానాజీ, విఆర్ఓ సుధాకర్ సచివాలయ సర్వేయర్ హరీష్ పాల్గొన్నారు

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రాంబిల్లి : స్థానిక కస్తూరిబా పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు శాంతా క్లాజ్‌గా వేషధారణతో, నిత్య రూపకాలతో అలరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కల్యాణి, నాగదేవి, సంధ్య ఆదిలక్ష్మి, దుర్గ, ఝాన్సీ, ఇందు పాల్గొన్నారు.

కశింకోట : మతసామరస్యంతో విద్యార్థులంతా కలిసిమెలిసి ఉండాలని సెయింట్ జాన్స్ స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్‌కుమార్ కోరారు. గురువారం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటి వారి పట్ల దయ, సహృదయత పాటించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తుల అనురాధ పాల్గొన్నారు.


ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని సుందరయ్యపేట, వెంకుపాలెం గ్రామాల్లో సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మండలశాఖ కార్యదర్శి ఆడారి చిన్న అప్పారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల కార్యదర్శి చెల్లూరి నాగరాజు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలపై పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆడారి పెద అప్పారావు, పోలమరశెట్టి నారాయణరావు, బోయిన గోవింద, రేఖ కల్యాణం పాల్గొన్నారు.

పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు



వడ్డాదిలో గడపగడపకూ వెళ్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



కె.కోటపాడులో విద్యార్థితో మాట్లాడుతున్న బూడి

ప్రజాశక్తి -కశింకోట : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గడపగడపకూ ప్రభుత్వంలో పాల్గొని, కొత్తగా పింఛన్లు మంజూరైన పత్రాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపిపి కలగా లక్ష్మి, మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపిడిఒ కొంకి అప్పారావు పాల్గొన్నారు.

కె. కోటపాడు : సమస్యలను పరిష్కరించి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సిఎం జగన్ గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. కింతాడ పంచాయతీలోని ఆరు శివారు గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు పలకలను అందజేశారు. గొంపవానిపాలెం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.13.94 కోట్ల నాడునేడు నిధులతో ఆధునికీకరించిన పనులను ప్రారంభించారు. ఎంపిపి రెడ్డి జగన్మోహన్, జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. మూడేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందచేశారు. హైస్కూల్‌లో నాడునేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల ద్వారా అవినీతి రహితంగా పారదర్శకతతో ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. అర్హత ఉండి ఏదైనా కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకం అందకుంటే పరిశీలించి, వారికి వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొండారాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి, ఎంపిపి దాకావరపు నాగేశ్వరదేవి, కొలిమల్ల అచ్చెన్నాయుడు, సర్పంచ్ యల్లపు విజయకుమార్, హెచ్‌ఎం డి.వరాహమూర్తి, ఇతర శాఖల అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా పలు పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న ఏకైక సిఎం జగనన్న అని పాయకరావుపేట శాసన సభ్యులు గొల్ల బాబురావు కొనియాడారు. మండలంలోని భీమవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. గ్రామంలో మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు..



ఊరేగిస్తున్న అర్చకులు

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం అర్చక బృందం గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, గోదాదేవి అమ్మవారిని తిరువీధి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది నవీన్, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని స్థానిక పాండురంగ స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయని ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధనుర్మాస ఉత్సవంలో భాగంగా శుక్రవారం అన్న సమారాధన, ప్రత్యేక పూజలు, సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సిఐ, ఎస్ఐలకు ఉత్తమ అవార్డులు



అవార్డు అందుకుంటున్న సిఐ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రతిభ కనబరిచిన పోలీసులకు పురష్కరాలు లభించాయి. అనకాపల్లిలో వార్షిక క్రైమ్ రివ్యూలో భాగంగా జిల్లా ఎస్పీ గౌతమిలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ ఏడాది అత్యంత ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు. దీనిలో భాగంగానే నర్సీపట్నం టౌన్ సిఐ నమ్మి గణేష్‌కు జిల్లాలో ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు దక్కింది. ఎస్సైలు జి.గోవిందరావు, జి.ధనుంజయనాయులకు అవార్డులు దక్కాయి. అక్టోబర్ 17న నర్సీపట్నం రామారావుపేటలోని దస్త్రాల రాఘవేంద్రరావు ఇంట్లో దొంగతనం కేసును 24 గంటల్లోపు చేధించడం, గంజాయి ముఠాలను పట్టుకోవడం తదితర వాటి నేపథ్యంలో ఎస్పీ షాలిని వీరిని అభినందించారు.

రోలుగుంట: రోలుగుంట ఎస్సై నాగకార్తీక్‌కు ఉత్తమ ఎస్సై అవార్డు దక్కింది. మండలంలోని 2022 ఏడాదిలో కేసుల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో ఈ అవార్డు దక్కింది. ఈ మేరకు బుధవారం వార్షిక క్రైమ్ రివ్యూ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎంఎస్.గౌతమిశాలి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సైని సిబ్బంది, పలువురు నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఎస్ఐ నాగకార్తిక్



అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి నూకేశ్వరరావు

గడ్డికోత యంత్రంపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో అడ్డసరం గ్రామంలో రోలుగుంట పశువైద్యాధికారి జి.నూకేశ్వరరావు గురువారం గడ్డికోత యంత్రం పని తీరుపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. రాయితీపై ఇచ్చే యంత్రాలతో శాస్త్రీయ పోషణలో పశువులను మేపుకోవచ్చునన్నారు. గడ్డి వృథాగా పోకుండా చాప్‌కట్టర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎకరం భూమిలో గడ్డి వేసి నాలుగైదు పశువులకు ఒక్కరే పశువులను ఒక గంటలో మేపుకోవచ్చునన్నారు. దీంతో రెండు టన్నుల గడ్డిని కోయవచ్చునని పేర్కొన్నారు. దీంతో కూలీల కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె పశుసంవర్ధక సహాయకులు రెడ్డి శివ, కంచుగుమ్మల, అడ్డసరం, కొత్తూరు, దిబ్బలపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బైలపూడిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని బైలపూడి గ్రామంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో వృద్ధులకు, పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపాడు జడ్పిటిసి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్ల అనురాధ, చీడికాడ మండలం జడ్పీటీసీ లాలం జానకిరామ్, చీడికాడ మండలం ఎంపీపీ కురచా జయమ్మ, దేవరపల్లి పార్టీ ప్రెసిడెంట్ బూరె బాబు రావు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.



బహుమతులు ఇస్తున్న అనురాధ

పలుచోట్ల గణిత దినోత్సవం



మాకవరపాలెంలో నమూనాలు ప్రదర్శిస్తున్న టీచర్స్

అనకాపల్లి జిల్లాలో గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి-మాకవరపాలెం: స్థానిక కస్తూరిబా, కొత్తపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా ప్రత్యేక అధికారి సునీత, కొత్తపాలెం ప్రధాన ఉపాధ్యాయుడు కోసూరు రాము పాల్గొన్నారు.

కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట, టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గణిత శాస్త్రంలో పలు ప్రయోగాత్మకమైన ప్రదర్శనలు తయారు చేశారు. టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కొత్తకోట పాఠశాల హెచ్ఎం డి.సత్యారావు, గణితశాస్త్ర ఉపాధ్యాయులు తారకేశ్వరరావు పాల్గొన్నారు. అర్జాపురం పాఠశాలలో హెచ్ఎం నాయుడు, సిఆర్పి రామారావు పాల్గొన్నారు.

రోలుగుంట: సివి రామన్ జయంతి వేడుకలలో భాగంగా మండలంలోని కొంతలం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బివి.రమణ ఆధ్వర్యంలో గణితశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలు, చార్టు, బొమ్మలు, ప్రాజెక్టులు వాటిని వివరించిన గణిత ఉపాధ్యాయులు చింతకాయల షన్ముఖ ప్రియధనలక్ష్మిని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. గణితశాస్త్ర గొప్పతనం తెలియజేసే విధంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీరికి ప్రథమ, తృతీయ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.అప్పారావు, సత్తిబాబు, సంతోషి, శివప్రసాద్, దొర, విజయలక్ష్మీ, త్రినాథ్ మాస్టర్ పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ హెచ్ఎం అప్పారావు ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పిడి రాజు, పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డి ఎల్ పురంలో హెచ్ఎం వేమగిరి నూకరాజు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శైలజ, చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు.

గొలుగొండ: మండలంలోని జోగంపేట హైస్కూల్లో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సరోజిని ఆధ్వర్యంలో విద్యార్థులు రంగవల్లులతో గణిత ప్రాముఖ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో..

అనకాపల్లి : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ జయబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామానుజన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, గణిత విభాగాధిపతి విక్టర్, అధ్యాపకులు సామ్రాజ్యం, జగదీష్ గణేష్ జ్యోతిర్మయి, విభాగాల అధిపతులు డాక్టర్ ఎం హరిబాబు, కొండలరావు, శ్యామల, రవీంద్ర, వేణుగోపాలనాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామానుజన్ విగ్రహానికి హెచ్ఎం బి.శ్రీధర్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రాజెక్టుల్లో ప్రథమ ద్వితీయ తతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు చిన్నబ్బాయి, శైలజ, రమణ రాజు, దయాసాగర్, అనిరోజ్, సంతోషి, ఉమా, విజయలక్ష్మి, గౌరీ, పట్టాభి, కామేశ్వరరావు, దామోదర్, గోపి, స్వామి పాల్గొన్నారు.

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గణిత దినోత్సవంలో ఎయు ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.శాంతి సుందర్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మల్టీపుల్ ఇంటిగ్రిల్స్, వాటి అనువర్తనాలపై ఉపన్యసించారు. వైస్ ప్రిన్సిపల్ వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కే.ఎస్. ఈశ్వర రావు, డాక్టర్ సిహెచ్ ప్రభాకరరావు, సోమశేఖర్ పాల్గొన్నారు.



రోలుగుంటలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గాయత్రి ప్రైమరీ స్కూల్‌లో గురువారం గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ బత్తిన కుమార్ పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నగేష్, వ్యవస్థాపకులు అయినాల అప్పారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: . మండలంలోని ఏడుమెట్ల మర్రిపాలెం గొన్న కళాశాలలో గణిత దినోత్సవం సందర్భంగా వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హేమచంద్ నాయుడు గణిత దినోత్సవం ప్రాముఖ్యతను, శ్రీనివాస రామానుజన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పిఎస్ఎన్ మూర్తి, విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపి మోడల్ స్కూల్‌లో గణిత క్లబ్

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మండలంలోని వేములపూడి ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా గణిత క్లబ్‌ను నిర్వహించారు. వివిధ రకాల గణిత టిఎల్ఎం ప్రదర్శన, పాటలు, స్కిట్ వంటి కార్యక్రమాలు నిర్వహిచినట్లు ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నమూనాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సంధ్య

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మొక్కలను నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని నక్కపల్లి సిఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని అడ్డురోడ్డు కూడలిలో గల జెడి కలెక్షన్స్ బట్టల దుకాణం నిర్వాహకులు ఉచితంగా మొక్కల పంపిణి చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, మొక్కలు నాటి ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచితంగా మొక్కలు పంపిణీ చేపట్టిన జెడి కలెక్షన్స్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న సిఐ

12న యువశక్తి బహిరంగ సభ

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: శ్రీకాకుళం జిల్లా రణస్థలం లో జనవరి 12న జరిగే యువశక్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో యువశక్తి పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్య చంద్ర మాట్లా డుతూ, వైసిపి పాలనలో ఉత్తరాంధ్ర ప్రాంతంలోని యువత వలసలు పెరిగి పోయా యన్నారు. జాబ్ క్యాడండర్ విడుదల చేయలేదన్నారు. పరిశ్రమలు కూడా రాష్ట్రానికి తీసుకురాలేని పరిస్థితి ఉందన్నారు. యువతలో చైతన్యమే లక్ష్యంగా యువశక్తి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

ట్యాబ్‌ల కొనుగోళ్లలో భారీ కుంభకోణం

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందించే ట్యాబ్‌ల కొనుగోళ్లలో భారీ కుంభకోణానికి తెరలేపారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గురువారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. సీఎం పుట్టిన రోజున భారీ అవినీతి బయటపడిందన్నారు. రాష్ట్రంలో 8వ తరగతి చదు పుతున్న విద్యార్థులకు సుమారు 5లక్షలకు పైగా ట్యాబ్‌ల కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క ట్యాబ్‌ను రూ.13,262లకు కొనుగోలు చేశారని, మార్కెట్లో, ఆన్లైన్లో ఆ ట్యాబ్ విలువ రూ.11,999లకే లభిస్తున్నాయన్నారు. రూ.13,262 లకు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఒకేసారి 5లక్షల ట్యాబ్లు కొంటే ఇంకా రూ.9వేలకే వచ్చేది కదా అన్నారు. చిన్న పిల్లల చదువుకోవడానికి ఇచ్చే ట్యాబ్లలో కూడా దోపిడి చేయడం సిగ్గు చేటన్నారు. ఈ ట్యాబ్‌ల రూపంలో రూ.220కోట్ల తేడా వచ్చిందని, ఇవి ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనిపై విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై విచారణ చేసి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలకు ప్రభుత్వ సొమ్ము రూ.3కోట్లు విడుదల చేయడం ఏమిటన్నారు. ప్రభుత్వ డబ్బుతో జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు చేయడం రాష్ట్రానికి పట్టిన కర్మ అని అయ్యన్న విమర్శించారు.



గెలుపొందిన కబడ్డీ జట్టు

ఘనంగా మరిడిమాంబ పండగ

-ఉత్సాహంగా కబడ్డీ, ఎడ్ల బళ్ల పోటీలు

ప్రజాశక్తి- కొత్తకోట:రావికమతం మండలం గుడ్డిప గ్రామంలో గురువారం గ్రామ దేవత మరిడిమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను మూడేళ్లు కు ఒకసారి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీ లతో పాటు ఎడ్ల బండి పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీలలో ఆరు జట్లు, ఎడ్ల బండ్లు పోటీలలో 11 జట్లు పాల్గొన్నాయి కబడ్డీ పొటిలలో జేఎం నాయుడు జట్టు ప్రధమ స్థానం లో నిలువగా వైజాగ్ వారియర్స్ రెండవ స్థానం లో నిలిచింది. ఎడ్ల బండ్లు పోటీలలో నర్సయ్యపేట ప్రథమ స్థానం, చుక్కపల్లి, నర్సాపురం బండ్లు రెండవ, మూడవ స్థానంలో నిలిచాయి. వీరికి రావికమతం ఎంపిపి పైల రాజు, గ్రామ సర్పంచ్ గణేశ్వర రావు తదితరులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

వాలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -కోటవురట్ల:నాతవరం మండలంలోని ఖాళీ గా ఉన్న వార్డు వాలంటీర్ల అభ్యర్థులకు గురువారం ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం మండలంలోని ఏపీ పురంలో 2, ఎంబి పట్నంలో 2, ఎం.బెన్నవరంలో 2 పోస్టుల గాను ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు.



ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.99.90 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్‌ను గురువారం రాత్రి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, వైద్య రంగాన్ని వికేంద్రీకరించడంలో భాగంగానే ప్రతి 30 వేల జనాభాకూ ఒక యుపిహెచ్‌సిని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ముఖ్యంగా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో 47 యుపిహెచ్‌సిలకు గాను ఇప్పటికే 37 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి కూడా త్వరలోనే పూర్త వుతాయని వివరించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా దీర్ఘ కాలంగా బెడ్ మీద ఉన్న రోగులకు వైద్యుడే ఇంటికి వెళ్ళి వైద్యం చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంటి ముంగిటకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ మల్లికార్జున, ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జెడ్‌సి ఎస్.వెంకట రమణ, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



చేపలుప్పాడలో యుపిహెచ్‌సిని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని

క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక జివిఎంసి మినీ క్రికెట్ స్టేడియంలో ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన 14 - 17 ఏళ్ల లోపు బాలురు బాలికలకు వాలీబాల్, కబడ్డీ, నెట్‌బాల్, త్రోబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పోటీల్లో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గెలుపు, ఓటములను ఒకేలా స్వీకరించాలని, క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడాకారులను తమ ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడా పోటీల నిర్వహణకుగాను దివీస్ సంస్థ రూ.1.96 లక్షల చెక్కును ఎమ్మెల్యేకి సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎన్.రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ డి.పెదబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, వైసిపి నాయకులు జగుపిళ్ల ప్రసాద్, ఎస్‌జిఎఫ్ విశాఖ, అనకా పల్లి, అల్లూరి జిల్లాల ఆర్గనైజింగ్ సెక్రటరీలు సిహెచ్.వెంకటరెడ్డి, ఆళ్ళ శేఖర్, పి.సూరిబాబు, పలువురు పిఇటిలు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

సిఎం బహిరంగ సభ స్థల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 28న నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ శంకుస్థాపన చేయనున్న సందర్భంగా నర్సీపట్నంలో బహిరంగ సభ నేపథ్యంలో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి, జిల్లా ఎస్పీ గౌతమి షాలిని,ఎమ్మెల్యే గణేష్, ఆర్డిఓ భవాని శంకర్, ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, సీఎం ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం తదితరులు స్థలాన్ని గురువారం పరిశీలించారు. మెడికల్ కాలేజీ శంకుస్థాపనపై ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. మూడవసారి ఏ విధంగా అయినా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించాలని, నర్సీపట్నంలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గణేష్ పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు, నాయికులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా నర్సీపట్నం, చింతపల్లి మార్గంలో డిగ్రీ కాలేజ్ వద్ద, సిఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక, నర్సీపట్నం- కోటవురట్ల మార్గంలో జోగునాదుని పాలెం వద్ద తదితర ప్రాంతాలు పరిశీలన చేశారు. సీఎం హెలిప్యాడ్‌కు, బహిరంగ సభకు తక్కువ దూరం ఉండేలా పరిశీలన చేయాలని కార్యక్రమం కన్వీనర్ రఘురాం తెలియజేశారు. వీరి వెంట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, డిసిసిబి చైర్ పర్సన్ అనిత సన్యాసిపాత్రుడు, నర్సీపట్నం, గోలుగొండ, నాతవరం, మాకవరపాలెం ఎంపీపీ, జడ్పిటిసిలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు ఉన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, ఆర్‌డిఒ



ఇసుకకు గిరాకీ

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో ఇసుకకు మంచి గిరాకీ ఏర్పడింది. ఎడ్లబండ్లతో తరలిస్తున్న ఇసుకకు ధరలు పెరగడంతో ఇసుక వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా సాగుతుంది.మండలంలో పిపి అగ్రహారం, కొండల అగ్రహారం, జి.కోడూరు, బి ఎస్‌పేట, జంగాలపల్లి తదితర గ్రామాల నుంచి ఎడ్ల బండ్లతో తరలిస్తున్న ఇసుకకు కాసులు కురిపిస్తున్నాయి. ఎడ్ల బండి ఒక్కంటికి వెయ్యి రూపాయల నుంచి 1200ల వరకు ధర పలుకుతుంది. ట్రాక్టర్ ఇసుక లోడు రూ.3500 ధర ఉంది. ప్రతిరోజు మండలంలో సుమారు 50 ఎడ్ల బళ్లతో ఇసుకను తరలిస్తున్నాయి. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు జోరు అందుకోవడంతో ఇసుక ధరలు బాగా పెరిగాయి. అధికారులు స్పందించి ఇసుకను తక్కువ ధరకు పంపిణీ చేయాలని కోరుతున్నారు

డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలోని 13వ వార్డులోని దుర్గాకోలనీ, ఇందిరా కోలనీలో నూతనంగా డ్రెయినేజీ పనులకు జడ్పిటిసి లంక సూర్యనారాయణ, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, వైసిపి పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీను, వైసిపి నాయకులు పెదపాటి మేకరంజన్, వార్డు మెంబర్లు తాటిపాక లావరాజ్, వార్డ్ మెంబర్లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు